క్లుప్తంగా

ఘనంగా శివస్వాముల పడిపూజ



మహాపడి పూజలో స్వాములు తదితరులు

మోమిన్‌పేట: శివస్వాములు 41రోజులు పాటు మండల పూజ చేయడం అభినందనీయమని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో గురుస్వామి శివరెడ్డి స్వామి ఆధ్వర్యంలో శివస్వాముల మహా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ మాలధారులు 41 రోజుల పాటు కఠోర దీక్ష చేయాలన్నారు. అప్పుడే చేసిన పూజా సార్థకత అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ స్వాములపై భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. స్వాములు భజనలు, పాటలు పాడుతూ భక్తులను అలరించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..



పడిపూజలో శివ స్వాములు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో శివ స్వాముల పడిపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కావటి భీములు శివ స్వామి ఇంట్లో ఆదివారం రాత్రి నిర్వహించిన పూజలో శివనామ స్మరణతో మారుమోగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వష్టం, శివాష్టకం వంటి పూజలు నిర్వహించారు. శివ స్వాములు నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోట్‌పల్లి ఎస్ఐ అబ్దుల్ గఫార్



మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్

బంట్వారం: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కోట్‌పల్లి ఎస్ఐ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పోటీలతో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, టోర్నమెంట్ నిర్వాహకులు శివకుమార్, అర్గనైజర్లు రాజు, శ్యాంసన్, ఇస్మాయిల్, సురేందర్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంట్వారం: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్ఐ అబ్దుల్‌గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రి వైద్యులు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరం ఉన్న రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గఫార్, అపోలో ఆస్పత్రి వైద్యులు మాట్లాడారు. పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ అంబికరాజు, నాయకులు రవి, వెంకటచారి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాణిక్య ప్రభువు ఉత్సవాలు

పరిగి: మిట్టకోడూర్ గ్రామంలో సోమవారం నుంచి మాణిక్యప్రభువు 78వ వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ప్రారంభమై 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 10న ప్రభువుల వారి పతాకముల ఊరేగింపు, 11న ఆంజనేయస్వామి పూజ, ప్రభువుల వారి యజ్ఞం, 12న పల్లకీ సేవ, 13న దర్బాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు సూచించారు.

అదనపు గదులు పూర్తయ్యే దెప్పుడు?

- ఇరుకు గదుల్లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు
- ఆరుబయట కొనసాగుతున్న చదువులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- వచ్చే విద్యా సంవత్సరానికైనా అందుబాటులోకి తేవాలని వేడుకోలు



వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువులు సాగిస్తున్నారు. కళాశాల పక్కనే అదనపు గదుల నిర్మాణ పనులను స్లాబ్ వరకు చేసి వదిలేశారు. దీంతో నిత్యం విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువులు కొనసాగిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను 2013లో ప్రారంభించారు. అప్పట్లో భవన నిర్మాణానికి రూ.2.2కోట్లు మంజూరు చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ. కోటి మాత్రమే విడుదల చేశారు. దీంతో 7గదులతో నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తెచ్చారు. మూడేళ్ల క్రితం విద్యార్థులకు గదులు సరిపోకపోవడంతో పక్కనే మరో 10గదుల కోసం నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనికోసం రూ. కోటి మంజూరు చేశారు. ఈ నిధులు సరిపోకపోవడంతో స్లాబ్ వరకు పనులు చేసి ఆపేశారు. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ మొత్తం 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో 6 గదులు, ఒక కార్యాలయం మాత్రమే ఉండటంతో విద్యార్థులకు తరగతి గదులు సరిపడక, ల్యాబ్‌లకు ప్రత్యేక గదుల్లేక అరకొర వసతులతో వరండాలోనే చదువులు సాగిస్తున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం చివరి దశలో ఉంది. ఈ విషయంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే నిధులు విడుదల చేయించి అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు మంజూరుచేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. మండలానికి రూ.4కోట్ల ఎన్ఆర్ఇజీఎస్ నిధులు, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.2కోట్లు, పంచాయతీ రోడ్లు రీ బీటీ కోసం రూ.1.25కోట్లు మంజూరు చేశారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచు పోచయ్య, సిరాజొద్దీన్, ఎజాస్ పటేల్, నర్సింలు, సురేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని పరిగి విద్యుత్ ఏఈ హరిక్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవిలో కొత్త లైన్ల కోసం పనులు నిర్వహిస్తున్న సందర్భంగా పట్టణ కేంద్రంలోని సన్‌సిటీ కాలనీ, జయంతినగర్‌కాలనీ, కెఆర్‌ఆర్ కాలనీ, ఎన్ఆర్‌వి కాలనీ, మధురానగర్, లక్ష్మీనగర్, ఆర్టీసీ కాలనీ, వెంకటేశ్వరకాలనీతో పాటు మాదారం, పేటమాదారం, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్, న్యామత్‌నగర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫర నిలిపేస్తారని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని హరిక్రిష్ణ కోరారు.



పాఠశాల పక్క నుంచే పారుతున్న మురుగు



డ్రైనేజీ పైప్‌లైన్‌కు తీసిన గుంత

మురుగు.. పరుగు!

- మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీ పైప్‌లైన్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని జీడిగడ్డ తండాలో అండర్ డ్రైనేజీ పైప్‌లైను పగలడంతో ఇళ్లలోకి మురుగు చేరుతుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు రోడ్డుపై చేరడంతో ఈగలు, దోమలు ఎక్కువవుతున్నాయని చెబుతున్నారు. దీంతో రాత్రిసమయాల్లో దోమలు కుట్టుతున్నాయని పేర్కొన్నారు. అండర్‌డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. కేవలం 10 ఫీట్ల మేర పైప్ వేసి సరిచేస్తే సమస్య తీరుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ పైప్‌లో చెత్త పేరుకపోవడంతో మురుగు చేరిందని చెబుతున్నారు. కొత్తగా పైప్‌వేసేందుకు నెల రోజుల క్రితం గ్రామ కార్యదర్శి గుంత తవ్వించి వదిలేశారు. ఆ గుంతను పూడ్చలేదు. దీంతో ఇళ్ల మధ్య రోడ్డుపై మురుగు చేరుతుంది. ఈ నీరుతో దుర్వాసన వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పక్కనే పాఠశాల ఉండడంతో విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎస్సీ వర్గీకరణ నివేదిక అశాస్త్రీయం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బందయ్య



దోమ: మందకృష్ణ మాదిగను గజమాలతో సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ మండల నేతలు



మందకృష్ణకు బొకే ఇస్తున్న మాదిగ ఉపాధ్యాయ సంఘం నాయకులు

దోమ: ఎస్సీ వర్గీకరణ నివేదిక అశాస్త్రీయంగా ఉందని, కులాల వారీగా రిజర్వేషన్ల వెనుక కుట్ర జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆర్ బందయ్య ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగను గజమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్గీకరణలో కుట్ర దాగిఉందని, రిజర్వేషన్ విషయంలో వెనక్కి తగ్గేది లేదన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో వర్గీకరణ విషయంలో మరో ఉద్యమం చేపట్టేందుకు తాము మీ వెంట కలిసి నడుస్తామని భరోసా ఇచ్చారు. ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారస్సులో మాదిగలకు దక్కాల్సిన రిజర్వేషన్లు రాలేదన్నారు. గ్రూప్–3లో మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలను అత్యంత వెనుకబడిన కులాలను ఉంచిన గ్రూప్–1లో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. కులాల కుర్చూ, రిజర్వేషన్ల కేటాయింపుపై కొంత మంది నెరిపిన మంత్రాంగం వల్లే మాదిగ జాతికి 11శాతం రిజర్వేషన్లు అందలేదన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను పారదర్శకంగా చేపట్టేంత వరకు తాము ఉద్యమం కొనసాగిస్తామని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు బొంపల్లి వెంకటేశ్, మైలారం సండి మహేశ్, కోశాధికారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు రమేశ్, లక్ష్మణ్, సోషల్ మీడియా కన్వీనర్ నాచారం వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇక్కిరాములు, నాయకులు మోత్కూర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం

పరిగి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఆదివారం నియోజకవర్గ టీఎంటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్సీ వర్గీకరణను సాధించిన సందర్భంగా ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడారు. 30 సంవత్సరాల పోరాట ఫలితమే వర్గీకరణ అని కొనియాడారు. మాదిగ, మాదిగఉప కులాలకు జనాభ ప్రకారం 11శాతం రిజర్వేషన్ రావాల్సి ఉండగా ప్రభుత్వం 9శాతం రిజర్వేషన్ కేటాయించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, నరేందర్, నర్సింహులు, వెంకటయ్య, లాలయ్య, బిచ్చయ్య, నరసింహారాజు, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి

ముస్లిం సంఘాల ఐక్య వేదిక జాతీయ నాయకుడు ఇస్మాయిల్



మాట్లాడుతున్న ఇస్మాయిల్

బొంరాస్‌పేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం సంఘాల ఐక్య వేదిక జాతీయ నాయకుడు, సీనియర్ జర్నలిస్టు సయ్యద్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఓటు బ్యాంకుగా కాకుండా సామాజిక అభివృద్ధి సాధించేలా అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సయ్యద్ ఇక్బాల్, టీఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, ఉపాధ్యక్షుడు వసీం, ఆసిఫ్, నవాబ్, సలాం, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

నక్కలపల్లిలో విద్యుత్ మరమ్మతులు



కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ ఏఈ హమునాయక్ ఆధ్వర్యంలో వేలాడుతున్న విద్యుగ్ తీగలు సరిచేసి, విరిగిన స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేపట్టారు. యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాట్లాడారు. 21 సంవత్సరాల క్రితం పదోతరగతి పరీక్షలు రాసి కొందరు పైచదువులకు, మరి కొందరు జీవనధారం కోసం పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇంకొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. అనంతరం వారు చిన్ననాటి అల్లరిపనులు స్మరించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఇలా తాము ఒక్కచోట కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీశైలం, ప్రభాకర్ రావ్, ప్రమీల దేవి, సిద్ధు, మల్లేశ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనంతరాములు, సురేశ్, బాల్‌రాజ్, రమేశ్, గోవర్ధన్, శేఖర్, మోహన్, మల్లేశ్, శ్రీనివాస్ బసప్ప, అశోక్, సుజాత, గంగమ్మ, పుష్పలత, విజయలక్ష్మీ, జ్యోతి, అనిత, మంగమ్మ, శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెలంగాణ ఉద్యమ నాయకుడు మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: తెలంగాణ తుదిదశ ఉద్యమ నాయకుడు మండల పరిధిలోని తుంకిమెట్లకు చెందిన వడ్ల మోనాచారి(40) మృతి చెందారు. గతంలో గుండె ఆపరేషన్ చేయించుకోగా స్వల్ప అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెలంగాణ ఉద్యమంలో పని చేయడంతో బీఆర్ఎస్‌లోకి ఆయనను తీసుకున్నారు. దీంతో అతను మండల నాయకుడిగా పార్టీకి సేవలందించారు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి, సోషల్‌మీడియా తాలుకా ఇంచార్జి నెహ్రూనాయక్, రాజేశ్‌రెడ్డి, తిరుపతయ్య, మల్లేశ్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఢిల్లీ ప్రజల తీర్పుతో బీజేపీలో జోష్'

చేవెళ్ల: ఢిల్లీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయ ఢంకా మోగించడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగిందని ఆ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం కొలువుదీరడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఆప్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, కుంభకోణాల కారణంగానే ఢిల్లీ ప్రజలు వారిని తిరస్కరించారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఆర్పీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తూరు: డీఆర్‌డీపీ ప్రాజెక్టులో మహిళ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ)ల పోస్టులకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసే వారి వయస్సు 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలని పేర్కొన్నారు.

బీజేపీ గెలుపు.. నేతల సంబురాలు



దుద్యాల్: హకీంపేట్ ప్రధాన కూడలిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

దుద్యాల్: ఢిల్లీలో బీజేపీ గెలవడంతో మండల పరిధిలోని హకీంపేట్ గ్రామ ప్రధాన చౌరస్తాలో ఆదివారం టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ బీజేపీ గెలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, బాలకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: ఢిల్లీలో బీజేపీ గెలవడంతో బీజేపీ ప్రధాన నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని నియోజకవర్గ నాయకుడు సతీష్‌ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 27 ఏళ్ల తర్వాత ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని డబుల్ ఇంజన్ సర్కార్ కల నెరవేరిందన్నారు.

గాడిబాయి శివాలయంలో పూజలు



శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో శివస్వాములు

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాడిబాయి శివాలయంలో ఆదివారం శివస్వాములు ప్రత్యే క పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. గాడిబాయి శివాల యం నుంచి ప్రధాన రహదారిలోని బసవేశ్వర ఆలయం, వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ పల్లకీసేవతో శ్రీమహాదేవుని ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా ఎడ్లతో నడుస్తూ శివస్వాములు ఖడ్గాలు వేస్తూ డోలక్‌లను కొడుతూ భక్తిశ్రద్ధలతో మహాదేవుని ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టకం, లింగాష్టకం, శివ అష్టోత్తర శతనామావళి, శరణుఘోష, దూపం, దీపం నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శివ స్వాములు భిక్ష స్వీకరించారు.

దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో..

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం జినుగుర్తి శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లో సాందీపని గురుకుల, వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. సాందీపని గురుకుల విద్యార్థుల ప్రతిభ ఎంతగానో ఆకట్టుకుందన్నారు. వారు ఎలాంటి భయం, భేషజాలం లేకుండా ధైర్యంగా విన్యాసాలు చేయడం గర్వకారణమన్నారు. సాందీపని పాఠశాల విద్యార్థులు దేశానికి ఆణిముత్యాల్లా తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సేంద్రియ వ్యవసాయం భేష్

జినుగుర్తి శివారులో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేసీ ఆధ్వర్యంలో 100 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేయడం అభినందనీయమని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప కొనియాడారు. ప్రస్తుతం కల్తీ ఆహారంతో రోగాల బారిన పడుతున్నామన్నారు. సేంద్రియ వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలు, ఇతర పదార్థాలను ఉపయోగించడం వల్ల మనిషి ఆరోగ్యంగా తయారవుతాడన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి భాగయ్య, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ పీవీ రావు, సాందీపని గురుకుల అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నిరసన దీక్ష

దౌల్తాబాద్: నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రైతు నిరసన దీక్షకు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, రైతులు హాజరు కావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.